"అది కాదురా బుజ్జికన్నా .... నేనంటే నీ కెందుకింత ప్రేమ?"

"మంచి తాతయ్యంటే మనవడికి ప్రేముండదేంటీ" అన్నాడు అదో విచిత్రమా అన్నట్టు.

"ప్రత్యేకించి ఈ పనికిరాని తాతయ్య మీద నీ కెందుకింత మక్కువా అని."

"చెప్పేయమంటావా తాతయ్యా" తాతయ్య గుండెపై తలానించి ఆకతాయిగా తల ఆయనవైపే తిప్పుతూ అన్నాడు "అన్ని రసాల్లోకి కరుణ రసం గొప్పదని నువ్వు చెప్పావుగా."

"కరుణ చూపిస్తే దేవుడిక్కూడా ప్రేమ పుడుతుందని చెప్పావుగా."

"అన్ని మాటలెలా నేర్చావురా చిట్టితండ్రి?"

"నువ్వే నేర్పావు" తాతయ్యతో చిలిపిగా అన్నాడు.

"చెప్పేయమంటావా తాతయ్యా....ఏకోరస: కరుణ పరనిమిత్త భేదాద్దిన్న: పృథ క్పృథగి నాశ్రయత వివర్తానే ఆవర్త బుద్బుద తరంగ మయాక వికరానంభో యధాసంల మేవహిత్త్య మస్తమౌ."

** ** ** **

అర్థరాత్రి....

గదిలో ఆదమరిచి నిద్రపోతున్న పావనిని ఎవరో తట్టినట్టయి ఉలిక్కిపడి లేచింది.

పక్కమీద చంద్రం కూర్చుని వున్నాడు.

ముందు నమ్మబుద్ధి కాలేదు.

"కాఫీ చేస్తావా?" ఆప్యాయంగా అడిగాడు.

అలాంటి ప్రేమకూడా ఆమెకు కొత్తే. అందుకే పరవశించింది. చీకటి కుహరంలో మగ్గిపోతున్న తన బ్రతుక్కి అదే కోరని కాంతి రేఖగా తలపోసి వంటగదిలోకి నడిచి లైటు వెలిగించింది.

దఢేల మన్న చప్పుడు, పెట్రోలియం గేస్ అంటుకున్నట్టుగా.

మరుక్షణం ఓ ఆర్తనాదం.

అంటుకున్న అరణ్యంలా రోదిస్తూ మంటలమధ్య కేకలతో బయటకు పరుగెత్తుకొచ్చింది.

నానీ ఉలికిపాటుగా నిద్రలేచాడు.

పక్కన అమ్మ లేదు.

కాని ఎదురుగా అమ్మ-మంటలా మండే అమ్మ ఆక్రందన చేస్తూంది.

"అ...మ్మా....!"

ఏ శనిదేవత రథచక్రపు యిరుకులోనో పడి నలుగుతున్నట్టు అమ్మని చేరబోతుంటే నాన్న పట్టుకున్నాడు.

అప్పుడు చూషాడు గదిలో పరుగెడుతున్న అమ్మలాంటి మంటను గమనిస్తున్న నాన్నమ్మని, అత్తయ్యని, తండ్రినీ అందర్నీ....

"ఎవరూ కదలరేం...అమ్మనెవరూ ఆదుకోవాలని ఆర్పాలని ప్రయత్నించరేం?"

చిన్ని మనసుకేదో అర్థమైపోతూంది

మరోసారి "అమ్మా" అంటూ కేకపెట్టి తండ్రి చేతిని విదిలించుకోబోయాడు.

"రా....కు...నాన్న...రాలి....పోతున్న...నా కోసం...నువ్వు కాలిపోకు...."

కదిలి కదిలి మంచంపైనే వున్న విశ్వేశ్వరశాస్త్రి రోదనలు నేపథ్యంకాగా ఒకచోట ఆగిపోయింది.

"అయ్యో....పావనీ" నాన్న చేరుకున్నాడు ముందు.

"వదినా" సరళ ఏడుస్తూ సమీపించింది.

"అమ్మా పావనీ" కాంతమ్మ గొంతెత్తి రోదిస్తూంది.

కాని....

నానీ ఏడవటం లేదు.

శిలలా నిలబడి అలాగే చూస్తున్నాడు. అప్పటికే జనం పోగయ్యారు.

నానీ చిన్ని పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

ఆ విషయాన్ని అక్కడెవరూ గమనించలేదు.

ఆ రాత్రే....

కొన వూపిరితో వున్న పావని పల్లెకు దగ్గరగా వున్న అనకాపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించబడింది.

ఊరంతా తరలి వచ్చింది.

కాని ఆమెను చేరే అవకాశం ఎవరికి లేకపోయింది.

ఆ రాత్రి అమ్మ పొట్టాని తన పుట్టిల్లుగా మార్చుకుని ఆదమరిచి నిద్రపోవాల్సిన నానీ ఓ మూల మోకాళ్ళపై తలుంచుకుని పిచ్చివాడిలా చూస్తు వుండిపోయాడు తప్ప ఎవరితోనూ మాట్లాడలేదు.

ఎందుకు కాలిపోయావు అని కాక ఎందుకు నిన్ను కాల్చేశారూ అని అమ్మనే అడగాలనుంది.

కాని ఎవరూ అమ్మ దగ్గరికి తీసుకు వెళ్ళడం లేదు.

తీసుకు వెళ్ళగల తాత మంచంపైన కళ్ళనీళ్ళు పెట్టుకుంటున్నాడు.

జరిగిన ఓ దారుణానికి ఒకే ఒక్క సాక్షి నానీ అని ఎవరూ ఊహించని ఆ క్షణంలోనే....

ఉదయం ఆరుగంటలకి పావని కొద్దిగా స్పృహలోకి వచ్చింది.

కళ్ళు తెరవగానే నానీ కోసం కలవరపాటుగా చూస్తూ ఏదో గొణిగింది. కాని అక్కడ ఎదురుగా కూర్చున్న పోలీసాఫీసర్‌కి గాని మరణ వాంగ్మూలం కోసమ ప్రిపేరయివచ్చిన ఫస్ట్‌క్లాస్

మేజిస్ట్రేట్ కి గాని అది అర్థం కాలేదు.

"అమ్మా పావనీ" ఆత్మీయంగా పిలిచిన మేజిస్ట్రేట్ ధర్మాన్ని రక్షించే విశ్వేశ్వరశాస్త్రిలా కనిపించాడు ఓ క్షణంపాటు

మూలిగింది సన్నగా.

"ఎలా వుందమ్మా"

ఆమె కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరగగా "బా....గా...నే....ఉంది" అంది నెమ్మదిగా. ఆమెకు తెలుసు తను ఏ స్థితిలో ఉన్నదీ!

అక్కడ గ్లాసు డోర్స్‌కి ఆవల నిలబడ్డ చంద్రం, కాంతమ్మ, సరళ ప్రపంచంకోసం దు:ఖాన్ని అభినయిస్తూ కూడా ఏం చెబుతుందో ఏ జవాబుతో తమ కఠాలకి ఉరి బిగుసుకుంటుందో అన్న భయంతో నిజంగానే ఏడ్చేస్తున్నారు.

ఇంత అనర్థానికి కారణమైన చంద్రం, కాంతమ్మ ఆ క్షణంలోకూడా ఆలోచిస్తున్నదొకటే. పూర్తిగా కాలి ప్రాణాలు పోగొట్టుకోక కొనవూపిరితో బ్రతికి తమ ప్రాణాల మీదకెందుకు తెచ్చిందా అని.

పావని కథ అక్కడే ముగిసిపోతే అది ఏక్సిడెంటుగా నిర్ధారించి ఈ పాటికి చేతులు కడిగేసుకునే వారేమో!

"నీ పేరు?" మేజిస్ట్రేట్ నోట్ చేసుకుంటూ అడిగాడు.

"పావని."

"భర్తపేరు?"

క్షణం ఆగింది-తాళిని ఉరిగా బిగించినవాడు భర్త అవుతాడా కాడాన్నట్లు "చంద్రం"

"అసలు ఈ ప్రమాదం ఎలా జరిగిందో గుర్తుచేసుకుని చెప్పగలరా?" మరణ వాంగ్మూలం సేకరణలో అతి ముఖ్యమయిన ప్రశ్న అది.

"చెప్పమ్మా" ఏ క్షణంలో అయినా ఆ దీపం ఆరిపోతుందని గ్రహించిన మేజిస్ట్రేట్ ఆమెను అయిష్టంగానయినా తొందర చేస్తున్నాడు.

"చె....బు....తా...ను...నా బ్రతుకు డైరీలో....ఆ....చివరి పేజీని చెప్పి గాని....చావను..నిన్న...అర్థరాత్రి."

నోట్ చేసుకుంటున్నాడు.

"నన్ను తట్టి లేపారు."

"ఎవరు....?"

"మా అబ్బాయి నానీ."

ఏ భవిష్యద్దర్శనం జరిగిపోయిందో ఏ ఫలితాన్ని ఆశించి కథనీ మలుపు తిప్పిందో అక్కడెవరికీ తెలీదు "అమ్మా పాలు కావాలీ అన్నాడు. వంటగదిలోకి వెళ్ళాను. గ్యాస్ వాసనొస్తుంటే రాత్రి స్టౌ బటన్ని ఆఫ్ చేయలేదని గుర్తుకొచ్చి చూడాలని లైటు

వెలిగించబోయాను. అంతే! మంటలు" ఆ తర్వాత-ఆమె చెప్పలేకపోయిందిక.....

కాంతమ్మ, చంద్రం, సరళలగుండెలు తేలికపడ్డాయి.

ఒకవేళ ఆమె మరణవాంగ్మూలం యివ్వకముందే మరణించినా ఊరంతా ఆ సాధ్వీమతల్లి పడిన కష్టాలను ఏకరువుపెట్టి ఇది ప్రమాదం కాదు, కావాలని చేసిన హత్యగా సాక్షమిచ్చేవారే....

కాని....

ఇన్నాళ్ళూ యిన్ని బాధలనెలా ఓర్చుకుంటుందో అర్థంకాని పావనే ఇప్పుడూ అర్థం కాలేదు.

మరో అర్థగంటలో మృత్యువుకి చేరువవుతున్న పావని చివరిగా చుట్టూ నిలబడ్డ అత్తయ్యా, ఆడపడుచులతోపాటు భర్తకూ చేతులు జోడించాలని ప్రయత్నించి విఫలమయింది.

"బాబును ఒక్కసారి చూపించరూ" అంది ప్రాణాలు పోతుంటే.

** ** ** **

ఊరంతా ప్రాకిన విషయం నానీదాకా వచ్చింది.

అంతే....

ఊపిరందనట్లు ఓ క్షణం ఉక్కిరి బిక్కిరి అవుతూ ఏడుస్తూ పైకి లేచాడు.

తన ముందు గదిలో కాలిపోతూ ఆక్రందనలు చేసిన అమ్మ, ఆర్పాలని ప్రయత్నించకుండా అలాగే చూస్తూ నిలబడ్డ నాన్న అందరూ గుర్తుకు వస్తుంటే అమ్మను కావాలని చంపేశారు అని తెలిసినా ఇప్పుడేం చేయాలో తెలీని నానీ ముందు తాతయ్య దగ్గరికి పరుగెత్తాడు.

కొన్ని గంటల వ్యవధిలోనే మిగిలి వున్న జీవకళను కోల్పోయిన ఆ వృద్ధుడు జీవన్ముక్తి కోసం తపించే మహర్షిలా నిర్వికల్ప సమాధిలోకి జారిపోయి వున్నాడు.